సాక్షి
జోగులాంబ గద్వాల
గురువారం। 29। ఫిబ్రవరి। 2024

బీఆర్ఎస్‌కు షాక్..!

లోక్‌సభ ఎన్నికల వేళ మారుతున్న సమీకరణలు

- కమలం గూటికి నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు
- ఆయన తనయుడు భరత్‌తో పాటు వనపర్తి జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి..
- డీకే అరుణ ఆధ్వర్యంలో నేడు ఢిల్లీకి.. పెద్దల సమక్షంలో చేరిక
- మాజీ ఎమ్మెల్యే మర్రి ముఖ్య అనుచరుడు జక్కా సైతం..
- ఉమ్మడి పాలమూరులో రసవత్తరంగా రాజకీయాలు



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: లోక్‌సభ ఎన్నికల వేళ బీఆర్ఎస్‌కు భారీ షాక్ తగిలింది. నాగర్‌కర్నూల్ సిట్టింగ్ ఎంపీ రాములు కారు దిగడం ఖాయమైంది. రాములుతో పాటు ఆయన కుమారుడు కల్వకుర్తి జెడ్పీటీసీ సభ్యుడు భరత్‌ప్రసాద్ బీఆర్ఎస్‌ను వీడి కమలం గూటికి చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఆధ్వర్యంలో వారు గురువారం ఢిల్లీకి పయనం కానున్నారు. వీలైతే ఇదే రోజు లేదంటే మరో రోజు జాతీయస్థాయి ముఖ్య నేతల సమక్షంలో పార్టీలో చేరనున్నట్లు తెలుస్తోంది. వీరితోపాటు వనపర్తి జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సన్నిహితుడు జక్కా రఘునందన్‌రెడ్డి సైతం గులాబీ పార్టీని వీడి బీజేపీలో చేరనుండడంతో పాలమూరులో రాజకీయాలు రసవత్తరంగా మారాయి.

జెడ్పీ 'పీట'ముడితో మొదలు..



రాములు, ఎంపీ



భరత్‌ప్రసాద్

2019లో జరిగిన నాగర్‌కర్నూల్ జెడ్పీ ఎన్నికల్లో టీఆర్ఎస్ విజయం సాధించింది. 20 జెడ్పీటీసీలకు గాను 17 స్థానాలు గెలుపొంది జెడ్పీపీఠాన్ని అధిరోహించింది. జెడ్పీచైర్మన్ పదవి ఎస్సీ జనరల్‌కు రిజర్వేషన్ కాగా.. కల్వకుర్తి నుంచి గెలుపొందిన అదే సామాజికవర్గానికి చెందిన భరత్‌ను చేయాలని తొలుత భావించారు. అనూహ్యంగా తెలకపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు పద్మావతి పేరును అప్పటి అచ్చంపేట, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యేలు బాలరాజు, మర్రి జనార్దన్‌రెడ్డి తెరపైకి తీసుకురాగా.. ఆమెకే అవకాశం దక్కింది. రాములు నాగర్‌కర్నూల్ ఎంపీగా ఉండడం, గతంలో అచ్చంపేట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించడంతో ఆయన కుమారుడు, విద్యావంతుడైన భరత్ ప్రసాద్‌ను చైర్మన్‌గా చేస్తే భవిష్యత్‌లో సమస్యలు తలెత్తుతాయని భావించిన సదరు నేతలు పద్మావతి పేరును తెర మీదికి తెచ్చినట్లు అప్పట్లో ప్రచారం సాగింది. ఈ క్రమంలో రాములు, ఆయా నేతలతో పాటు అనుచరుల మధ్య విభేదాలు చోటుచేసుకున్నాయి. అయితే జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఉన్న తెలకపల్లి జెడ్పీటీసీ పద్మావతి ఎన్నికల అఫిడవిట్‌లో సంతానానికి సంబంధించి తప్పుడు వివరాలు సమర్పించారని కాంగ్రెస్ అభ్యర్థి సుమిత్ర ఎన్నికల ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. విచారణ అనంతరం కోర్టు తీర్పు మేరకు 2022 చివరలో ఆమెపై అనర్హత వేటు పడింది. దీనిపై ఆమె డివిజనల్ బెంచీకి వెళ్లినా చుక్కెదురైంది. దీంతో జిల్లా పరిషత్ చైర్మన్ ఎంపిక అనివార్యం కాగా.. తొలి నుంచి పీఠం ఆశిస్తున్న భరత్‌నే జెడ్పీ చైర్మన్ పదవి వరిస్తుందని అందరూ భావించారు. కానీ.. మళ్లీ తలకిందులైంది. ఈ నేపథ్యంలో రాములు, గువ్వల వర్గాల మధ్య వైరం మరింత ముదిరింది.

అసెంబ్లీ టికెట్ ఆశించి..

అసెంబ్లీ ఎన్నికల ముందు భరత్‌ప్రసాద్ అచ్చంపేట ఎమ్మెల్యేగా బరిలో ఉంటానని స్పష్టం చేయడంతో పాటు నిత్యం ఆయా మండలాల్లో తిరిగారు. భరత్‌కు కాదంటే తనకు ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వాలని ఎంపీ రాములు సైతం బీఆర్ఎస్ అధిష్టానాన్ని కోరినట్లు సమాచారం. కానీ.. బాలరాజుకే టికెట్ కేటాయించిన పెద్దలు ఎంపీ ఎన్నికలప్పుడు చూద్దామని హామీ ఇచ్చి సమస్య సద్దుమణిగించారు. అప్పటి నుంచి నారాజ్‌గా ఉన్న రాములు, భరత్ అసెంబ్లీ ఎన్నికల తర్వాత పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వచ్చారు. నాగర్‌కర్నూల్, అచ్చంపేట పట్టణ కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్లమెంట్ స్థాయి సమావేశానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరు కాగా.. రాములు పాల్గొనకపోవడం చర్చనీయాంశంగా మారింది. అప్పటి నుంచే ఆయన పార్టీ మారడం ఖాయమన్న ప్రచారం ఊపందుకుంది. కాగా, ఇది వరకే రాములుకు కాంగ్రెస్, బీజేపీల నుంచి ఆహ్వానం అందినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్‌లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానం నుంచి బరిలో నిలిచేందుకు మల్లురవి, సంపత్‌కుమార్ పోటీ పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన బీజేపీ వైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది.

వనపర్తిలో కుదుపు..

వనపర్తి జెడ్పీ చైర్మన్ **లోక్‌నాథ్‌రెడ్డి బీఆర్ఎస్‌ను వీడను**న్నట్లు తెలుస్తోంది. ఎంపీ రాములుతో కలిసి నేడు లేదంటే మరో రోజు బీజేపీలో చేరనున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో అప్పటి మంత్రి నిరంజన్‌రెడ్డి వ్యవహారశైలిని వ్యతిరేకిస్తూ ప్రస్తుత ఎమ్మెల్యే మేఘారెడ్డి తదితరులతో కలిసి లోక్‌నాథ్‌రెడ్డి బీఆర్ఎస్‌ను వీడారు. అనంతర పరిణామాల క్రమంలో లోక్‌నాథ్‌రెడ్డి బీజేపీలో చేరుతున్నట్లు ప్రచారం జరిగినా.. మళ్లీ కారెక్కారు. మేఘారెడ్డి మాత్రం కాంగ్రెస్‌లో చేరి, అనూహ్యంగా టికెట్ సాధించి ఎమ్మెల్యేగా గెలుపొందారు. మరోవైపు వనపర్తి జిల్లా మెంటపల్లి సర్పంచ్, సర్పంచ్‌ల సంఘం ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి సైతం బీఆర్ఎస్‌ను వీడనున్నారు. ఆయన బీజేపీలో చేరేది ఖాయమైనా.. ఎప్పుడు చేరతారనే దానిపై స్పష్టత లేదు.



లోక్‌నాథ్‌రెడ్డి



పురుషోత్తంరెడ్డి

- నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సన్నిహితుడు జక్కా రఘునందన్‌రెడ్డి బీఆర్ఎస్‌ను వీడనున్నట్లు సమాచారం.ఇద్దరూ తిమ్మాజీపేట మండలంలోని నేరెళ్లపల్లికి చెందిన వారే. మర్రి శ్రేయోభిలాషిగా, ముఖ్య అనుచరుడిగా ఉన్న జక్కా ఇటీవల కాలంగా పార్టీకి, మర్రికి దూరంగా ఉంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో వారి మధ్య విభేదాలు వెలుగుచూడగా.. మారిన రాజకీయ పరిణామాల క్రమంలో జక్కా బీజేపీలో చేరేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.



జక్కా రఘునందన్‌రెడ్డి

తండ్రికా.. కుమారుడికా ?

రాములుకు నాగర్‌కర్నూల్ ఎంపీ టికెట్‌పై హామీ దక్కిన తర్వాతే.. ఆయన కమలం గూటికి చేరుతున్నట్లు తెలుస్తోంది. అయితే రాములు బరిలో నిలుస్తారా.. ఆయన కుమారుడు భరత్ పోటీలో ఉంటారా అనేది తెలియాల్సి ఉంది. మరోవైపు ఈ ఎంపీ స్థానంపై బంగారు శ్రుతి ఆశలు పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో అధిష్టానం ఆమెకు ఎలాంటి హామీ ఇస్తుందనే అంశంపై పార్టీలో జోరుగా చర్చ జరుగుతోంది.

న్యూస్‌రీల్

అయిజ ఎంపీపీగా ప్రహ్లాదరెడ్డి

అయిజ: మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం ఎన్నికల నిర్వహణ అధికారి ప్రసాద్‌రావు నిర్వహించిన ఎంపీపీ ఎన్నికలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఉప్పల ఎంపీటీసీ ప్రహ్లాదరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలో మొత్తం 16 ఎంపీటీసీ స్థానాలు ఉండగా బీఆర్ఎస్ పార్టీ నాయకుడు ఉత్తనూరు ఎంపీటీసీ తిరుమలరెడ్డి రెండు సంవత్సరాల క్రితం మృతిచెందాడు. అప్పటినుంచి ఇప్పటి వరకు వైస్ ఎంపీపీగా ఉన్న ఎక్లాస్‌పురం ఎంపీటీసీ నాగేశ్వర్‌రెడ్డి ఇంచార్జ్ ఎంపీపీగా కొనసాగుతూ వచ్చారు. ఎంపీపీ ఎన్నికకు నోటిఫికేషన్ వేయడంతో ఎంపీపీ ఎన్నిక అనివార్యమైంది. మిగిలి ఉన్న మొత్తం 15 ఎంపీటీసీల్లో ఒకరు యాపదిన్నె ఎంపీటీసీ కాంగ్రెస్ పార్టీకి చెందినవారు. చిన్నతాండ్రపాడు ఎంపీటీసీ స్వతంత్ర్య అభ్యర్థి. మిగిలిన 13 మంది ఎంపీటీసీలు బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారు. ఎంపీపీ ఎన్నికల సందర్భంగా వెంకటాపురం ఎంపీటీసీ వేణుగోపాల్‌రెడ్డి ఉప్పల ఎంపీటీసీ ప్రహ్లాదరెడ్డిని ఎంపీపీగా ప్రతిపాదించారు. చిన్న తాండ్రపాడు ఎంపీటీసీ లక్ష్మన్న బలపరిచారు. అందరు ఎంపీటీసీలు చేతులెత్తి ప్రహ్లాదరెడ్డిని ఎంపీపీగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి ప్రహ్లాదరెడ్డితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఎంపీడీఓ వెంకటయ్య, డీసీఓ సూపరెండెంట్ నారాయణ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ మహేష్ పాల్గొన్నారు.

ఫిర్యాదుల కోసం హెల్ప్‌లైన్

గద్వాల క్రైం: జిల్లా నుంచి వివిధ సమస్యలపై ఎస్పీ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి ఫిర్యాదులపై బాధితులు వారి సమస్యల విచారణ సమాచారం కోసం హెల్ప్‌లైన్ నంబర్ 08545- 273000కు సంప్రదించాల్సిందిగా ఎస్పీ రితిరాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదులను విచారణ అధికారుల దర్యాప్తు అంశాలను తెలుసుకునేందుకు రిసెప్షన్ వారిని అడిగి తెలుసుకోవచ్చాని తెలిపారు. ప్రభుత్వ పని దినాల్లో ఉదయం 10 : 30 గంటల నుంచి సాయంత్రం 6 : 00 గంటల వరకు సిబ్బందిని అడిగి తెలుసుకోవచ్చని సూచించారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- మొదటి రోజు 204 మంది విద్యార్థులు గైర్హాజరు

గద్వాల: ఇంటర్మీడియేట్ వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. గతంలో కంటే ఈ సారి సౌకర్యాలు మెరుగయ్యాయి. అయినప్పటికీ కొన్ని పరీక్షా కేంద్రాలలో విద్యార్థులు అసౌకర్యాల మధ్య పరీక్షలు రాశారు. బుధవారం గద్వాల జిల్లా వ్యాప్తంగా ఉన్న 14 పరీక్ష కేంద్రాలలో 4,195 మంది విద్యార్థులకు గాను 3,991 మంది మొదటి సంవత్సర విద్యార్థులు ఇంటర్ పరీక్షలకు హాజరయ్యారు. 204 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు. పరీక్షా సమయం నిర్ణీత గడువుకు అరగంట ముందే విద్యార్థులను తనిఖీ చేసి పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు. మధ్యాహ్నం 12గంటలకు పరీక్ష పూర్తయిన వెంటనే విద్యార్థులను బయటకు పంపించారు. పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు బెంచీలను ఏర్పాటు చేశారు. అయితే కొన్ని గదులలో వెలుతురు సక్రమంగా లేకపోవడం వలన విద్యార్థులు అవస్థలు పడ్డారు. కొన్ని గదులలో ఫ్యాన్ల కొరత కనిపించింది. గతంలో ఎన్నడు నిర్వహించని విధంగా సీసీ కెమెరాల నీడలో పరీక్షలు జరిగాయి. ప్రతి కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. మెడికల్ సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఇంటర్ విద్య జిల్లా అధికారి హృదయరాజు, ఇతర అధికారుల బృందాలు వేర్వేరుగా పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.



గద్వాలలోని పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఐఈఓ హృదయరాజు

నిమిషం ఆలస్యం.. పరీక్షకు దూరం

మానవపాడు: ఇంటర్ వార్షిక పరీక్షల్లో ఒక నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతి నిరాకరణ నిబంధనతో ముగ్గురు విద్యార్థులు పరీక్ష రాయలేకపోయారు. చేసేదిలేక కన్నీటి పర్యాంతమై వెనుదిరిగారు. ఈఘటన మానవపాడు మండలంలో బుధవారం చోటుచేసుకుంది. మండలంలోని గంగు వెంకట కృష్ణరెడ్డి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పరీక్ష కేంద్రానికి విద్యార్థులు సాయికుమార్, దీపక్, తిరుమలేష్ ఆలస్యంగా చేరుకున్నారు. సాయికుమార్ ఆరోగ్యం బాగోలేక ఆలస్యమైందని కన్నీరు మున్నీరయ్యాడు. ఇక మిగతా ఇద్దరు విద్యార్థులు స్వగ్రామమైన వనపర్తి జిల్లా బలిజపల్లి నుంచి ఇక్కడికి వచ్చే సరికి బస్సు ఆలస్యమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక నిమిషం జీవితాన్ని మారుస్తుందని, అధైర్యపడొద్దని, జీవితం చాలా ఉందని ఎస్ఐ చంద్రకాంత్ విద్యార్థులకు ధైర్యం చెప్పారు. రేపటి పరీక్షలను సమయానికి వచ్చి రాయాలని వారికి సూచించడంతో బాధతో వెనుదిరిగారు.



మానవపాడులో పరీక్ష కేంద్రానికి ఆలస్యంగా వచ్చిన ముగ్గురు విద్యార్థులు

కర్ణాటక గవర్నర్‌కు సన్మానం

ఎర్రవల్లిచౌరస్తా: కర్ణాటక రాష్ట్ర గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్‌ను బుధవారం పదో బెటాలియన్ కమాండెంట్ సాంబయ్య ఘనంగా సన్మానించారు. గవర్నర్ హైదరాబాద్ నుంచి కర్ణాటకకు వెళ్తుండగా ఎర్రవల్లి కూడలిలో ఆయనకు కమాండెంట్ మొక్కను అందించి స్వాగతం పలికారు. అనంతరం బెటాలియన్ గెస్ట్ హౌస్‌లో కాలువాకు చేరుకున్నారు. కార్యక్రమంలో బెటాలియన్ అధికారులు, ఇటిక్యాల తహసీల్దార్ నరేందర్, కార్యాలయం సిబ్బంది ఉన్నారు.



యాదృచ్ఛికంగా ముహూర్తం..



యాదృచ్ఛికమో.. గ్రహబలమో కాని లీపు సంవత్సరం ఫిబ్రవరి 29న పెళ్లి నిశ్చయమైంది. మా పేర్లపై ఉన్న బలం మేరకు పండితులు ముహూర్తం నిశ్చయించారు. అరుదైన రోజున పెళ్లి వేడుక నిర్వహించుకోవడం సంతోషంగా ఉంది. గురువారం ఉదయం 11:15 గంటలకు మా పెళ్లి జరగనుంది.

– విశ్వనేత్రాచారి – స్నేహశీల, నవాబ్‌పేట

జీవితంలో గుర్తుండిపోవాలని..



వారిద్దరూ ఉన్నత హోదాల్లో స్థిరపడ్డారు. ఒకే తరహాలో చదువు, ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూ.. పెళ్లికి సిద్ధమయ్యారు. తమతో పాటు బంధువులు, స్నేహితులు, సహచర ఉద్యోగులు సైతం తమ పెళ్లిని మరిచిపోకూడదని వనపర్తికి చెందిన సాయితేజ – శివాని నాలుగేళ్లకు ఒకసారి వచ్చే ఫిబ్రవరి 29వ తేదీన పెళ్లి ముహూర్తాన్ని ఖరారు చేయించుకున్నారు. నాలుగేళ్లకు ఒకసారి పెళ్లిరోజు సంబరాలను బంధువులు, స్నేహితులతో కలిసి వైభవంగా జరుపుకోవడం సరికొత్త అనుభూతిగా పేర్కొంటున్నారు.

మధుర జ్ఞాపకం

ఫిబ్రవరి 29.. నాలుగేళ్లకోసారి వేడుక

- ఎంతో తీపి గుర్తు అంటున్న పెళ్లి రోజు జంటలు
- పుట్టిన రోజును ఆనందంగా చేసుకుంటామంటున్న మరికొందరు
- నేడు శుభముహూర్తాన పెళ్లి చేసుకుంటున్న ఇంకొన్ని జంటలు



సాధారణంగా ఫిబ్రవరి నెలలో 28 రోజులే ఉంటాయి. భూపరిభ్రమణానికి 365 రోజుల మీద పావురోజు పడుతుంది. నాలుగేళ్లకోసారి ఈ పావు రోజులు కలిపి ఒక రోజు అదనంగా చేరుతోంది. అలా ఫిబ్రవరి 29 రోజులు వచ్చిన ఏడాదిని లీపు సంవత్సరం అంటారు. నాలుగేళ్లకోసారి వచ్చే ఈ అరుదైన రోజున పుట్టిన వారు, పెళ్లి చేసుకున్న వారికి జీవితాంతం ఎంతో మధుర స్మృతిగా ఉంటుంది. లీపు సంవత్సరంలో పుట్టిన వారు, పెళ్లి రోజును మరో నాలుగు సంవత్సరాలు గుర్తుండేలా ప్రత్యేకంగా చేసుకునేందుకు సిద్ధం అవుతున్నారు. ఆస్పత్రుల్లో ఈ రోజే ప్రసవాలు చేయించుకునేందుకు ఉత్సాహంగా ఉన్నారు. లీపు సంవత్సరం సందర్భంగా గురువారం వేడుకలు నిర్వహించి తీపి జ్ఞాపకంగా ఉంచుకునేందుకు సిద్ధమవుతున్న వారి గురించి ప్రత్యేక కథనం..

– సాక్షి నెట్‌వర్క్

మాపెళ్లి రోజు ప్రత్యేకం..



మా పెళ్లికి ఫిబ్రవరి 29న ముహూర్తం కుదరడం అనుకోని విషయం. అందరూ ప్రతి ఏటా పెళ్లి రోజు జరుపుకొంటే.. మేము మాత్రం నాలుగేళ్లకో సారి జరుపుకోవాల్సి వస్తుంది. ఈ విషయంపై మేమిద్దరం కలిసి మాట్లాడుకున్నప్పుడు ఒక రకమైన అనుభూతికి లోనయ్యాం. పెళ్లి ముహూర్తాన్ని ఇద్దరు వ్యక్తుల జాతకం మేరకు నిర్ణయిస్తారు. మాకు ఈనెల 29న ముహూర్తం బాగుందని చెప్పారు. దీనిపై మొదట్లో కొంత ఆలోచనలో పడినప్పటికీ.. మాపెళ్లి రోజు ప్రత్యేకంగా ఉంటుందని ఒప్పుకున్నాం.

– మురళీధర్‌రెడ్డి – రిషికారెడ్డి, రేపల్లె, గద్వాల మండలం

ఆనందంగా ఉంది..

లీపు సంవత్సరంలో అరుదైన రోజున పెళ్లి నిశ్చయం కావడం ఆనందంగా ఉంది. గురువారం అచ్చంపేటలోని అంగిరేకుల శేఖరయ్య గార్డెన్స్‌లో మా వివాహం జరగనుంది. ఇటీవలే నిశ్చితార్థం జరిగింది. మా పేరు బలం మేరకు ఫిబ్రవరి 29న మంచి ముహూర్తం ఉండటంతో వివాహం నిశ్చయించారు.

– మహేష్‌కుమార్ – నిఖిత, అచ్చంపేట



పేరు మార్చాల్సి వస్తుందని..



ఆగమ శాస్త్రాల ప్రకారం పెళ్లి అంటే ఒక్కోసారి అబ్బాయి పేరుకు అమ్మాయి పేరు మ్యాచ్ కాదు. మాఘశుద్ధ పంచమి, స్వాతి నక్షత్రం రోజున మంచి ముహూర్తం ఉండటం.. ఉన్న పేర్లతోనే ఆగమ శాస్త్రాల ప్రకారం పెళ్లి చేసుకోవాలని నిశ్చయించుకున్నాం. రెండు నెలల కిందట నాగర్‌కర్నూల్‌లో నిశ్చితార్థం చేసుకున్నాం. మా జీవితంలో ఒక రోజు స్పెషల్‌గా ఉండాలనే మా పెళ్లి వేడుకను ఫిబ్రవరి 29ను ఎంచుకున్నాం.

– పిన్నశెట్టి రాము – సుధారాణి, నాగర్‌కర్నూల్

ఊహించలేదు..

మా పెళ్లి ముహూర్తం ఫిబ్రవరి 29న వస్తుందని ఊహించలేదు. నాలుగేళ్లకోసారి లీపు సంవత్సరంలో ఫిబ్రవరి 29వ తేదీ రావడం కొత్త అనుభూతిని ఇస్తుంది. పెళ్లి రోజు వేడుకలను కుటుంబంతో కలిసి పండగలా జరుపుకునేలా ప్లాన్ చేస్తాం.

– కె.శ్రీనివాసులు – మంజుల, అడ్డాకుల



64 ఏళ్లు.. 14 పుట్టిన రోజులు..



నా వయసు ప్రస్తుతం 64 ఏళ్లు. ఫిబ్రవరి 29న పుట్టడంతో అందరిలాగే ప్రతి సంవత్సరం పుట్టిన రోజు వేడుకలు నిర్వహించుకునే అవకాశం లేకపోయింది. ఇప్పటి వరకు 14 మార్లు మాత్రమే పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నాను. మళ్లీ నాలుగేళ్ల తర్వాత పుట్టిన రోజు రావడంతో కుటుంబ సభ్యులతో పాటు స్నేహితులతో కలిసి మరింత స్పెషల్‌గా జరుపుకునేలా ప్లాన్ చేసుకున్నా.

– అయూబ్‌ఖాన్, డీసీసీ ప్రధాన కార్యదర్శి, అమరచింత

ఘనంగా పుట్టిన రోజు వేడుకలు



నేను 29–02–2004లో పుట్టాను. ప్రస్తుతం హైదరాబాద్‌లో బీఎస్సీ రేడియాజీ చదువుతున్నాను. అందరిలా నేను ప్రతి సంవత్సరం పుట్టిన రోజు వేడుకలు జరుపుకోను. నాలుగేళ్ల కోసారి వచ్చే పుట్టిన రోజు వేడుకలను మా నాన్న ఘనంగా జరిపిస్తాడు. బంధువులందరి సమక్షంలో పండగ వాతావరణంలో పుట్టిన రోజు వేడుకలు జరుపుకొంటాను.

– బిందు, కొత్తకోట

చాలా థ్రిల్లింగ్‌గా ఉంటుంది



సాధారణంగా ప్రతి ఒక్కరికీ పట్టిన రోజు ప్రతి సంవత్సరం వస్తుంది. నాకు మాత్రం నాలుగేళ్లకో సారి వస్తుంది. పుట్టిన రోజున చాలా థ్రిల్లింగ్‌గా ఉంటుంది. ఇది స్పెషల్ బర్త్‌డే కాబట్టి గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకుంటా. ఈ ఏడాది మాత్రం కళాశాలలో ఉన్నందున స్నేహితుల మధ్య సెలబ్రేట్ చేసుకోవాల్సి వచ్చింది.

– రుడావత్ మహేష్‌నాయక్, నాగర్‌కర్నూల్

నా పుట్టినరోజు అందరికీ స్పెషల్..



నా పుట్టిన రోజు అందరికీ ప్రత్యేకం. నేను లీపు సంవత్సరం ఫిబ్రవరి 29న జన్మించాను. ఇప్పటి వరకు రెండు సార్లు మాత్రమే పుట్టిన రోజు వేడుకలను జరుపుకోన్నాను. ప్రస్తుతం వనపర్తిలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాను. మూడో పుట్టిన రోజు వేడుకలను తల్లిదండ్రులు, స్నేహితుల మధ్య జరుపుకుంటాను. నాలుగేళ్లకు ఒకసారి పుట్టినరోజు వేడుకలు నిర్వహించుకోవడం థ్రిల్లింగ్‌గా ఉంటుంది.

– ప్రవళిక, చనుగోనిపల్లి, గద్వాల మండలం

నాలుగేళ్ల తర్వాత మొదటి జన్మదిన వేడుక



ఎవరైనా ప్రతి సంవత్సరం జన్మదిన వేడుకలు జరుపుకోవడం సర్వసాధారణం. అయితే మక్తల్ మండలం ముస్టిపల్లికి చెందిన మహేందర్ – గీత దంపతులకు లీపు సంవత్సరం 2020 ఫిబ్రవరి 29న శ్రీతన్‌సాయి జన్మించాడు. పుట్టిన నాలుగేళ్ల తర్వాత మొదటి జన్మదిన వేడుకలు నిర్వహించుకోవడంపై వారు ఆనందం వ్యక్తంచేశారు. మొదటి జన్మదిన వేడుకలను స్వగ్రామంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

ఎప్పటికీ గుర్తుండిపోయే జ్ఞాపకం..



పెళ్లి అంటేనే ఎప్పటికీ గుర్తుండిపోయే ఘట్టం. అలాంటిది అందరిలా కాకుండా కాస్త భిన్నంగా పెళ్లి రోజు వస్తే బాగుంటుందని అనుకున్నాం. ఫిబ్రవరి 29న మంచి రోజు కావడంతో అదే రోజు పెళ్లి జరిపించాలని పెద్దలు నిర్ణయించారు. నాలుగేళ్లకో సారి పెళ్లి రోజు జరుపుకోవడం థ్రిల్లింగ్‌గా ఉంటుంది.

– ఇసూఫ్‌బాబా, అమరచింత

పేరు బలంపై ముహూర్తం ఖరారు..

మా ఇరువురి పేరు బలాల మేరకు పెళ్లి ముహూర్తం ఖరారుచేశారు. నాలుగేళ్లకో సారి వచ్చే లీపు సంవత్సరం ఫిబ్రవరి 29న పెళ్లి ముహూర్తం ఖరారు చేయడం ఆనందంగా ఉంది. పెళ్లి రోజు కోసం ఎదురుచూడటం సరికొత్తగా అనిపిస్తుంది.

–అఖిల్ – మౌనిక, కాశీపూర్, అలంపూర్ మండలం



మంచి ముహూర్తం ఉండటంతో..



ఫిబ్రవరి 29న మంచి ముహూర్తం ఉండటంతో పెద్దల సమక్షంలో పెళ్లి నిశ్చయించారు. ప్రత్యేక రోజున మా పెళ్లి జరగడం ఆనందంగా ఉంది. నాలుగేళ్లకోసారి పెళ్లి రోజు వేడుకలు నిర్వహించుకోవడం స్పెషల్‌గా ఉంటుంది. లీపు సంవత్సరం ఎప్పుడొస్తుందా అని ఎదురుచూస్తాం.

– మంజునాథ్‌నాయుడు – సుచిత్ర, చెన్నిపాడు, మానవపాడు

వేచి చూడటంలోనే ఆనందం..

పెళ్లి రోజు వేడుకలను ప్రతి ఏడాది జరుపుకోవడం సర్వసాధారణం. మా పెళ్లిరోజు స్పెషల్‌గా ఉండాలనుకున్నా. అందుకే లీపు సంవత్సరం ఫిబ్రవరి 29న వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నా. తల్లిదండ్రులతో చర్చించి, అదే రోజు మంచి ముహూర్తం ఉండటంతో వివాహం నిశ్చయించారు. పెళ్లి రోజు కోసం వేచి చూడటంలో ఎంతో ఆనందం ఉంటుంది.

– నామాల రవికుమార్ – సిరి, అమరచింత



ఆర్డీఓల బదిలీలు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పలువురు ఆర్డీఓలను ప్రభుత్వం బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. గద్వాల ఆర్డీఓ డి.చంద్రకళ మంచిర్యాల స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భూసేకరణ విభాగానికి బదిలీ కాగా.. నారాయణపేట ఆర్డీఓ ఆర్.రాంచందర్ గద్వాలకు బదిలీ అయ్యారు. వరంగల్ ఆర్డీఓ ఎం.వాసుచంద్రను నారాయణపేట ఆర్డీఓగా నియమించారు. కామారెడ్డి జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ ఈ.నవీన్‌ను మహబూబ్‌నగర్ ఆర్డీఓగా, పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న కె.మాధవిని అచ్చంపేట ఆర్డీఓగా నియమించారు. అచ్చంపేట ఆర్డీఓ ధరూరు సుబ్రహ్మణ్యంను నల్లగొండజిల్లా భూసేకరణ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమిస్తూ బదిలీ చేశారు.

క్లుప్తంగా

ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొని వ్యక్తి దుర్మరణం

మిడ్జిల్: ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ ఆనంద్, గ్రామస్తుల కథనం మేరకు.. మండలంలోని వాడ్యాల్‌కు చెందిన కొమ్ము నర్సింహ్మ (58) మండల కేంద్రంలో పూల వ్యాపారం నిర్వహిస్తుండేవాడు. బుధవారం ఉదయం 11.30 ప్రాంతంలో జడ్చర్ల నుంచి బైక్‌పై పూలు తీసుకొని మిడ్జిల్ సమీపానికి రాగానే కల్వకుర్తి నుంచి జడ్చర్ల వైపు వెళ్తున్న కల్వకుర్తి డిపోకు చెందిన బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన నర్సింహను వెంటనే చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం మృతిచెందాడు. నర్సింహకు భార్య భారతమ్మ, కుమారుడు, కుమార్తె ఉండగా.. కుమారుడు కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ వివరించారు.

ఆటో ఢీకొని వ్యక్తి..

గద్వాల క్రైం: ఆటో ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పట్టణ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. రాఘవేంద్రకాలనీకి చెందిన సమ్మద్ (47) వృత్తిరీత్యా రియల్‌ఎస్టేట్ ఏజెంట్‌గా జీవనం సాగిస్తున్నాడు. తెల్లవారుజామున పనినిమిత్తం అయిజ రింగురోడ్డు మీదుగా బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఆటో ఎదురుగా వచ్చి బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సమ్మద్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటో డ్రైవర్ పరారీలో ఉన్నాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య

మదనాపురం: మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కిందపడి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ తెలివిన తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం కురుమూర్తికి చెందిన హరిజన్ కురుమన్న (25) కొంతకాలంగా మతిస్థిమితం లేకుండా తిరుగుతుండేవాడు. మంగళవారం సాయంత్రం కాచిగూడ నుంచి గుంటూరు వెళ్తున్న ప్యాసింజర్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం గుర్తు తెలియని మృతదేహమని సోషల్ మీడియాలో పెట్టడంతో తల్లితండ్రులు సాయన్న, మన్నెమ్మ గుర్తించి గద్వాల ఆస్పత్రికి చేరుకున్నారు. పోస్టుమార్టం నిర్వహించి వారికి అప్పజెప్పినట్లు ఆయన తెలిపారు.

ఆటో డ్రైవర్..

మహబూబ్‌నగర్ క్రైం: ఆటో నడుపుతూ జీవనం సాగించే ఓ యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే ఎస్ఐ అక్బర్ తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని బొక్కలోనిపల్లికి చెందిన దేవేందర్(22) బుధవారం రాత్రి 10గంటల ప్రాంతంలో పట్టణంలోని బండమీదిపల్లి సమీపంలో గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయన కొన్ని రోజులుగా ఆటో డ్రైవర్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆత్మహత్య గల కారణాలు తెలియరాలేదని, కేసు నమోదు చేసినట్లుఎస్ఐ వెల్లడించారు.

ఉరేసుకుని యువకుడు..

పెబ్బేరు రూరల్: వనపర్తి పట్టణ కేంద్రంలోని సాయినగర్ కాలనీకి చెందిన వడ్ల రాజేష్ ఇంట్లో ఉరేసుకుని బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వనపర్తి పట్టణ ఎస్ఐ జయన్న తెలిపిన వివరాల ప్రకారం.. వడ్ల రాజేష్ (35) వెల్డింగ్ పని చేసుకుంటూ కుటుంబాని పోషిస్తున్నాడు. బుధవారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకుని తాడుకు వేళాడుతుండడంతో స్థానికులు గమనించి అతనిని ఆస్పత్రికి తరలించగా, అతను అప్పటికే మృతి చెందాడు. మృతుడి తండ్రి వడ్ల రామాచారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

బాలిక బలవన్మరణం

మల్దకల్: పురుగుమందు తాగి బాలిక ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని ఎల్కూరులో బుధవారం వెలుగు చూసింది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన నీలావతి (16) కొంతకాలంగా కడుపునొప్పితో బాధ పడుతుండేదన్నారు. మంగళవారం రాత్రి నొప్పి అధికం కావడంతో ఇంట్లో ఉన్న పురుగుముందు తాగింది. గుర్తించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ విషయాన్ని ఎస్ఐ సురేష్‌గౌడ్ వద్ద ప్రస్తావించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

గోపాల్‌పేట: చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందిన ఘటన వనపర్తి జిల్లా రేవల్లి మండలంలో చోటుచేసుకుంది. రేవల్లి ఎస్ఐ తిరుపతి రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని నాగపూర్ చెందిన దక్షిణమూర్తి (65) మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో దూదిపరుపుపై బీడీ తాగి పడుకున్నాడు. అనుకోకుండా బీడీ పరుపుపై పడి అంటుకుంది. దక్షిణమూర్తి పరుపులో నుంచి లేవలేకపోయాడు. భార్య మిద్దెపై ఉండటంతో అరిచినా శబ్దాలు వినిపించలేదు. ఇంట్లో నుంచి పొగలు చూసి ఇంట్లోకి వెళ్లి చూడగా దక్షిణమూర్తికి అప్పటికే మంటలు అంటుకున్నాయి. వెంటనే ఆయనను రేవల్లి, నాగర్‌కర్నూల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

మోడల్ కోడ్ పాటించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

- ఏప్రిల్ 4వరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు
- కలెక్టర్ జి.రవినాయక్

పాలమూరు: రాజకీయ పార్టీలు తప్పనిసరిగా మోడల్ కోడ్ పాటించాలని కలెక్టర్ జి.రవినాయక్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ శాసనమండలి స్థానానికి ఉపఎన్నిక నిర్వహించేందుకు ఈసీ షెడ్యూల్ విడుదలచేసిన నేపథ్యంలో మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగుళాంబ గద్వాల, నాగర్‌కర్నూల్, వనపర్తి, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిందన్నారు. ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మార్చి 4న నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు చెప్పారు. 11వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 12న పరిశీలన, 14వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ఉంటుందన్నారు. 28న ఉదయం 8నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్, ఏప్రిల్ 2న ఓట్ల లెక్కింపు, 4వ తేదీతో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందన్నారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు, మైక్‌సౌండ్, వాహనాల అనుమతులను సంబంధిత కలెక్టర్ల నుంచి పొందవచ్చని తెలిపారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ ఎండీ ఇద్రీస్, బీజేపీ నాయకుడు రాజేందర్‌రెడ్డి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ అఖిల ప్రసన్న, ఎన్నికల డీటీ జాఫర్ ఉన్నారు.

విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికావొద్దు

సంక్షేమ హాస్టళ్లలో ఉంటూ విద్యనభ్యసిస్తున్న విద్యార్థినీ విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని కలెక్టర్ రవినాయక్ అన్నారు. షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బుధవారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లాలోని సంక్షేమ హాస్టళ్ల అధికారులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల పలు ప్రభుత్వ, ప్రైవేటు హాస్టళ్లలో విద్యార్థులు మానసిక ఒత్తిడితో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని.. అలాంటి ఘటనలను నివారించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. విద్యార్థులు మానసికంగా కృంగిపోకుండా చూడటంతో పాటు మానసిక స్థైర్యం పెంపొందించాలని సూచించారు. చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వారికి ఏ రంగంలో ఆసక్తి ఉందో గుర్తించాలన్నారు. చదువుతో పాటు ఆటలు, యోగా, ధ్యానంలో విద్యార్థులను ప్రోత్సహించాలని తెలిపారు. హాస్టళ్లలో విద్యార్థులు ఏదేని సమస్యతో బాధపడుతుంటే, వ్యక్తిగతంగా పిలిచి మాట్లాడాలన్నారు. వారికి స్వేచ్ఛను కల్పిస్తూ, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. హాస్టళ్లకు వచ్చే వ్యక్తులపై నిఘా ఉంచాలన్నారు. అన్ని హాస్టళ్లల్లో మూత్రశాలలు, ప్రహరీ, సీసీ కెమెరాలు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం మానసిక విశ్లేషకుడు పి.లక్ష్మణ్ మాట్లాడుతూ.. శారీరక రోగానికి ఎంత ప్రాధాన్యం ఇస్తామో.. మానసిక రోగానికి కూడా అంతే ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఆత్మహత్యలకు ప్రేరేపించే గల కారణాలు, మానసిక ఆరోగ్యం, క్వాలిటీ ఆఫ్ లైఫ్, మానసిక వ్యాకులత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ డీడీ పాండు, అధికారులు రాంలాల్, సరోజ, సుషిత పాల్గొన్నారు.

నేడు సీఎన్‌జీ గ్యాస్ మదర్ స్టేషన్ ప్రారంభం

జడ్చర్ల: జిల్లాలోని పరిశ్రమలు, గృహ, వాణిజ్య అవసరాల నిమిత్తం పైపులైన్ ద్వారా సీఎన్‌జీ గ్యాస్‌ను సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన మెఘా గ్యాస్ సీఎన్‌జీ మదర్ స్టేషన్‌ను గురువారం పోలేపల్లి సెజ్‌లో ప్రారంభించనున్నారు. పెట్రోలియం అండ్ న్యాచురల్ గ్యాస్ రెగ్యులేటరి బోర్డు సభ్యుడు అంజనీ కుమార్ తివారీ ప్రారంభోత్సవానికి హాజరుకానున్నారు. పోలేపల్లి సెజ్‌లో కొనసాగుతున్న ఓ టైల్స్ పరిశ్రమకు తొలిసారిగా సీఎన్‌జీని సరఫరా చేయనున్నారు. అదేవిధంగా బాలానగర్ మండలం బోడజానంపేటలో గృహావసరాలకు కూడా సీఎన్‌జీని సరఫరా చేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభిస్తారు.

మన్యంకొండలో కోడెదూడల వేలం

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి భక్తులు సమర్పించిన కోడెలను బుధవారం దేవస్థానం వద్ద వేలం వేశారు. ఈసారి 58 కోడె దూడలను భక్తులు స్వామివారికి సమర్పించగా, దేవస్థానానికి రూ.2,78, 700 ఆదాయం సమ కూరిందని చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజులు తెలిపారు. ఈసారి దళారులకు కాకుండా పట్టాదారు పాసు పుస్తకాలు ఉన్న రైతులు మాత్రమే వేలంలో పాల్గొనేలా దేవాలయశాఖ అధికారులు చేసి కోడెలను వారికి దక్కేలా చర్యలు తీసుకున్నారు.

దివ్యాంగులను బీఆర్‌ఎస్ విస్మరించింది

- ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే మా లక్ష్యం
- కాంగ్రెస్ దివ్యాంగులసెల్ రాష్ట్ర చైర్మన్ ముత్తినేని వీరయ్య

స్టేషన్ మహబూబ్‌నగర్: దివ్యాంగుల సంక్షేమాన్ని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర చైర్మన్ ముత్తినేని వీరయ్య విమర్శించారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గాల పార్టీ దివ్యాంగుల విభాగం సమీక్ష సమావేశంలో రాష్ట్ర చైర్మన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దివ్యాంగుల సంక్షేమంపై మాజీ మంత్రులు హరీష్‌రావు, కేటీఆర్‌లు చర్చకు రావాలని కోరారు. పదేళ్లుగా దివ్యాంగుల దినోత్సవానికి హాజరుకాని ఏకైక సీఎం కేసీఆర్ అని ఎద్దేవాచేశారు. జిల్లాకో దివ్యాంగుల స్టడీ సెంటర్ అంటూ మేనిఫెస్టోలో పెట్టిన బీఆర్‌ఎస్ ఆ హామీని నెరవేర్చలేదని, హెల్త్ కార్డులు ఇస్తామని మోసం చేశారని ఆరోపించారు. ఆనాడు కాంగ్రెస్ హయాంలో దివ్యాంగుల వాహనాలకు ఇచ్చే సబ్సిడీని, అంత్యోదయ కార్డులను గత ప్రభుత్వం ఎత్తివేసిందని విమర్శించారు. ఇలా చెప్పుకుంటూ పోతే దివ్యాంగులకు 100 రకాల అన్యాయాలను కేసీఆర్ చేశారని ఆరోపించారు. ఉమ్మడి జిల్లాలో 12 కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల గెలుపుకై శ్రమించిన దివ్యాంగులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. రానున్నల్లో ఎంపీ ఎన్నికల్లో పార్టీ దివ్యాంగుల విభాగం నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. పార్టీ కోసం కష్టపడిన దివ్యాంగులకు రాబోయే కార్పొరేషన్ నామినేటెడ్ పదవుల్లో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని, కాంగ్రెస్ మేనిఫెస్టోలో దివ్యాంగులకు రూ.6వేల పింఛన్, మిగతా వర్గాలకు రూ.4వేల పింఛన్, బస్సుల్లో ఉచిత ప్రయాణం, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ కోసం అమలుచేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండడంపై హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో సతీష్‌గౌడ్, తెలుగు వెంకటేష్, కురువ శ్రీనివాసులు, బురాణప్ప, నగేష్‌గౌడ్, అజీజ్‌ఖాన్, నరసింహులు, పాండు నాయక్, వెంకట్‌రెడ్డి, రాంచంద్రయ్య, గుండ నాయక్, అరుణ్, బాష తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర చైర్మన్ వీరయ్యను సన్మానిస్తున్న జిల్లా నాయకులు

భూమి ఆక్రమించారని ఫిర్యాదు

నవాబుపేట: ఫోర్జరీ సంతకాలతో భూమి పట్టా చేయించుకున్నారని బాధితుడు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని తీగలపల్లికి చెందిన బాలస్వామి 2005లో గ్రామంలో ఓ గొడవ విషయంలో జైలుకు వెళ్లాడు. ఆ సమయంలో తన సంతకం ఫోర్జరీ చేసి భూమిని పట్టా చేసుకున్నారని ఈ విషయంలో న్యాయం చేయాలని గతంలో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కోర్టుకు సైతం వెళ్లడంతో కోర్టు భూమిపై స్టేటస్‌కో విధించింది. కాగా ఇటీవల ఆ స్థలంలో నిర్మాణాలు మొదలుపెట్టారు. తనకు తమ కుటుంబ సభ్యులకు ఉన్న 4 ఎకరాల 25 గుంటల భూమిలో 1.2 గుంటల భూమి మాత్రమే తనకు వస్తుందని, కానీ తన భూమితో పాటు తమ కుటుంబీలకు భూమి సైతం ఆక్రమించుకున్నారని బాధితుడు వాపోయాడు. దీంతో తాజాగా తనకు న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి విచారిస్తామని ఎస్ఐ అభిషేక్‌రెడ్డి తెలిపారు.

దొంగకు దేహశుద్ధి

జడ్చర్ల: స్థానిక జౌకీనగర్ ప్రాంతంలో ఇంట్లోకి చోరీ చేసేందుకు ఇంటి ప్రహరీ దూకిన ఓ యువకుడిని స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో యువకుడిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. గతంలో ఇతను ఓ లాడ్జీలో నగదు అపహరించిన కేసులో నిందితుడుగా ఉన్నట్లు సమాచారం.

చెట్టును ఢీకొట్టిన కారు

- కర్ణాటక వాసి మృతి, ఇద్దరికి గాయాలు

అడ్డాకుల: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ఇద్దరు గాయపడిన ఘటన భూత్పూర్ మండలం గోప్లాపూర్ వద్ద బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. కర్ణాటకలోని బీజాపూర్ జిల్లా నెడ్‌బూంది తాలుకా బెనాల్ చెందిన మల్లు సజన్(50) అక్కడి పోలీసు శాఖలో పీఎస్ఐ హోదాలో ఉద్యోగం చేస్తున్నాడు. మరో ఇద్దరితో కలిసి శ్రీశైలం వెళ్లారు. దర్శనం చేసుకుని స్వస్థలానికి తిరుగు ప్రయాణమయ్యారు. గోప్లాపూర్ సమీపంలో కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. సజన్ అక్కడికక్కడే మృతి చెందాడు. కారు డ్రైవర్ హన్మంతు, మల్లయ్య గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

చట్టాలపై అవగాహన అవసరం

పాలమూరు: జిల్లాలో నల్సా పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి మరింత అవగాహన కల్పించాలని, సరైన ప్రణాళిక ద్వారా చట్టాలపై చైతన్యం చేయాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి అన్నారు. జిల్లాకేంద్రంలోని న్యాయసేవాభవన్‌లో బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మాట్లాడారు. మార్చి 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌కు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఈ ఏడాది క్యాలెండర్ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అనంతరం వర్క్ డన్ రిపోర్ట్ పరిశీలించడంతో పాటు లీగల్ ఎయిడెడ్ కేసుల పనితీరు పరిశీలించారు. సమావేశంలో ప్యానల్ న్యాయవాదులు, జ్యువెనల్ జస్టిస్ బోర్డ్ న్యాయవాదులు, లీగల్ ఎయిడ్ క్లినిక్స్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

వడ్ల బస్తాల చోరీ నిందితులు అరెస్ట్

చిన్నచింతకుంట: మండలంలోని పెద్దదగడ శివారులోని గోదాంలో ఈ నెల 22వ తేదీన వడ్ల బస్తాలను ఎత్తుకెళ్లేందుకు యత్నించిన వారిని స్థానిక పోలీసులు బుధవారం పట్టుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసి ఏడుగురు నిందితులను, డీసీఎం, బొలెరో స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాలో ఉన్న 14మందిని పట్టుకున్నామని వీరు కోడేరు, పెద్దగడ, వెల్దడ, బలూర్మ గ్రామాల్లో చోరీలకు పాల్పడ్డారని ఎస్పీ రక్షి తమూర్తి బుధవారం ప్రకటనలో తెలిపారు. మిగితా కొంతమంది పారిపోవడంతో వారిని కూడా పెద్దకొత్తపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఏడుగురిని నిందితులను చిన్నంబావి, గోపాల్‌పేట, పాన్‌గల్, వీపనగండ్ల ఎస్ఐలతో, పోలీసు సిబ్బంది నిందితులను పట్టుకుని వారిని కోర్టులో హాజరుపరిచారు.

మెడికోలకు స్వల్ప అస్వస్థత?

- ఫుడ్ పాయిజన్ కారణమా?
- అదే ఆస్పత్రిలో చికిత్స

మహబూబ్‌నగర్ క్రైం: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఓ మెడికల్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు కలుషిత ఆహారం తినడంతో ఫుడ్ పాయిజన్ అయినట్లు తెలుస్తోంది. రెండు రోజుల కిందట చికెన్‌తో పాటు మరికొన్ని వంటకాలను మెడిసిన్ చదువుతున్న కొందరు విద్యార్థులు తినడంతో అస్వస్థతకు గురైనట్లు సమాచారం. ఆ విద్యార్థులను అదే ఆస్పత్రిలోని ఒక ప్రత్యేక వార్డులో ఉంచి చికిత్స అందిస్తున్నట్లు సమాచారం. ఈ విషయం బయటకు తెలియకుండా ఉండటానికి ఆస్పత్రి యాజమాన్యం ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆస్పత్రిలో పనిచేసే ఉద్యోగులు, సిబ్బందిని ఎవరిని అడిగినా.. సదరు ఘటన గురించి తమకు ఏం తెలియదని దాటవేశారు.

జోరందుకున్న ఉల్లి వ్యాపారం

- దేవరకద్ర మార్కెట్‌లో క్వింటాల్ ధర గరిష్టంగా రూ.1,620
- కనిష్టంగా రూ.1,200

దేవరకద్ర: దేవరకద్ర మార్కెట్లో బుధవారం ఉల్లి వ్యాపారం జోరుగా సాగింది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులతో పాటు స్థానిక వ్యాపారులు పోటాపోటీగా వేలంలో పాల్గొన్నారు. వివిధ గ్రామాల నుంచి రైతులు పెద్ద ఎత్తున ఉల్లిని మార్కెట్‌కు తీసుకురావడంతో ఎక్కడ చూసినా.. ఉల్లి కుప్పలతో నిండిపోయింది. వారానికి ఒకసారి ఉల్లి వ్యాపారం జరగడంతో వినియోగదారులు, చిరు వ్యాపారులతో మార్కెట్ కళకళలాడింది. మార్కెట్‌కు దాదాపు 5,000 బస్తాల ఉల్లి అమ్మకానికి వచ్చింది. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన వేలం మధ్యాహ్నం వరకు కొనసాగింది. వేలం ఆలస్యం కావడంతో కొందరు రైతులు ధర నిర్ణయించి నేరుగా ఉల్లిని అమ్ముకున్నారు. ఈ ఏడాది సీజన్ ప్రారంభం నుంచి ఉల్లి ధరలు దిగి వచ్చాయి. నాలుగు వారాలుగా ఉల్లి ధరలు వంద అటు ఇటుగా నిలకడగానే ఉన్నాయి.

గత వారం ధరలే నమోదు..

దేవరకద్ర మార్కెట్‌లో బుధవారం జరిగిన వేలంలో నాణ్యమైన ఉల్లి ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.1,620 పలికింది. గత వారం నమోదయిన ధరలే ఈ వారం నమోదయ్యాయి. రెండో రకం ఉల్లి కనిష్టంగా రూ.1,200గా నమోదయ్యాయి. గత వారం కన్నా రూ.200 కనిష్ట ధరలు ఎక్కువగా వచ్చాయి. మార్కెట్ నిబంధనల ప్రకారం 45 కిలోల బస్తా ధర గరిష్టంగా రూ.800, కనిష్టంగా రూ.600 వరకు విక్రయించారు. ఉల్లి నాణ్యంగా ఉండటంతో పాటు బాగా ఆరబెట్టింది కావడంతో చాలా మంది బస్తాలుగా ఉల్లిని కొనుగోలు చేశారు. వినియోగదారులు ఏడాది పొడవునా నిల్వ చేసుకోడానికి, ఇక శుభకార్యాలకు ఎక్కువగా ఉల్లిని కొనుగోలు చేశారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు కొనుగోలు చేసిన ఉల్లిని నేరుగా వాహనాల్లో తరలించారు. ఇక చిరు వ్యాపారులు సైతం పెద్ద ఎత్తున ఉల్లిని కొనుగోలు చేశారు. మార్కెట్‌లో జోరుగా వ్యాపారం సాగడంతో సందడిగా మారింది.



ఉల్లి కుప్పలతో దేవరకద్ర మార్కెట్

9.5 కిలోల వెండి ఆభరణాలు చోరీ

నాగర్‌కర్నూల్ క్రైం: ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు భారీ చోరీకి పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలోని లక్ష్మీనగర్ కాలనీలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రానికి మిడిదొడ్డి బుచ్చయ్య మంగళవారం సాయంత్రం హైదరాబాద్ శుభకార్యానికి వెళ్లారు. బుధవారం ఉదయం తిరిగి ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో పక్కించివారు గమనించి బుచ్చయ్యతో పాటు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలాన్ని సీఐ కనకయ్య, ఎస్ఐ పరిశీలించి క్లూస్ టీం ద్వారా ఆధారాలు సేకరించారు. పూజగదిలో ఉన్న 9.5కిలోల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

జడ్చర్ల: ఇంటి తలుపులు విరగ్గొట్టి చోరీకి పాల్పడిన ఘటన సరస్వతీనగర్ కాలనీ సమీపంలో చోటు చేసుకుంది. ఎస్ఐ చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం. బాధితురాలు చంద్రకళ తన భర్త భాస్కర్ ఇటీవల మరణించడంతో మంగళవారం ఇంటికి తాళం వేసి స్థానిక రాజీవ్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్న తమ బంధువుల వద్దకు నిద్ర చేసేందుకు వెళ్లింది. బుధవారం మధ్యాహ్నం ఇంటికి తిరిగి వచ్చే సరికి ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించింది. ఇంటి వెనుక తలుపులు విరగ్గొట్టి ఇంట్లోకి వచ్చిన దొంగలు బీరువాలో దాచిని రూ.60వేల నగదుతో పాటు 40 తులాల వెండి గొలుసులు ఎత్తుకెళ్లారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో క్లూస్ టీం వచ్చి ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



ఇంట్లో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం

ట్రస్టు పేరిట ప్రభుత్వ భూమి కబ్జా

అమరచింత: పట్టణంలోని విలువైన గ్రామ కంఠం స్థలం ట్రస్టు పేరిట కబ్జాకు గురై ఆపై రిజిస్ట్రేషన్ సైతం చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పట్టణంలో ప్రధాన రహదారి పక్కన ఉన్న కందకం స్థలాన్ని 2003లో జీఎస్ స్వచ్ఛంద సంస్థ పేరిట గ్రామ పంచాయతీ పరిధిలో ఆజ్ఞ పత్రం సంపాదించి 2023లో వాటిని సబ్‌రిజిస్టర్ కార్యాలయంలో చూపి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. జీ.శ్రీనివాస్ పేరిట ట్రస్టు నిర్వహిస్తు సీపీఎం కార్యాలయ సమీపంలోని కందకం స్థలాన్ని ట్రస్టు పరిధిలోని తీసుకొద్దామనే ఆలోచనతో సీపీఎం పార్టీ నాయకులు స్థలాన్ని సొంతం చేసుకున్నట్లు తెలిసింది. మున్సిపాలిటీ ఏర్పాటు అనంతరం ప్రభుత్వ స్థలాలు, గ్రామ కంఠం భూములు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించిన మున్సిపాలిటీ, అదే స్థలంలో సామూహిక మరుగుదొడ్లు సైతం నిర్మించారు. అప్పుడు ఈ వ్యవహారంపై పెదవి విప్పని సీపీఎం పార్టీ ప్రస్తుతం ఆస్థలం తమదే అంటూ ప్రచారం చేయడంతో అసలు విషయం బయటకు వచ్చింది. బీజేపీ నాయకలు పట్టణంలోని ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని వాటిలో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులకు విన్నవించడం, ఆపై సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, కలెక్టర్‌కు విన్నవించడంతో సదరు గ్రామ కంఠం స్థలం జీ.శ్రీనివాసులు ట్రస్ట్ పేరిట రిజిస్ట్రేషన్ జరిగిందని జిరాక్స్ పత్రాలు అందించారు. దీంతో అసలు స్థలం ఎక్కడుందని మున్సిపల్ అధికారులు ఆరాతీస్తున్నారు.



రిజిస్ట్రేషన్ జరిగిన గ్రామ కంఠం స్థలం

27 కాటన్ల మద్యం చోరీ

- దాదాపు రూ.2.63లక్షల విలువ ఉంటుందని అంచనా

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు శివారులోని మద్యం దుకాణంలో మంగళవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. బుధవారం ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. పుల్లూరు టోల్‌గేట్ సమీపంలో నిర్వహిస్తున్న మద్యం దుకాణంలో అందులో పనిచేస్తున్న క్యాషియర్ నరేందర్‌రెడ్డి మంగళవారం రాత్రి 10 గంటలకు మూసివేసి కర్నూల్‌లో అతని ఇంటికి వెళ్లిపోయారు. బుధవారం ఉదయం 7:30 గంటలకు పక్క షాపు యజమాని రాఘవేంద్ర నరేందర్‌కు ఫోన్ చేసి వైన్స్‌లో చోరీ జరిగిందని సమాచారం ఇచ్చాడు. షాపును తెరిచి చూడగా వెనుక నుంచి రేకులను కత్తిరించి, కాంపౌండ్ వాల్ తొలగించినట్లు గమనించారు. దుకాణంలో రూ.2,63,280 విలువ గల 27 మద్యం కాటన్లు, రూ.8,160 నగదు ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో క్లూస్, డాగ్స్ టీం అక్కడికి చేరి పరిశీలించారు. సీఐ రవిబాబు, ఎస్ఐ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సీసీ పుటేజ్ వైర్లను తొలగించినట్లు తెలిపారు. క్యాషియర్ నరేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

హత్యకు పాల్పడిన ముగ్గురి రిమాండ్

నాగర్‌కర్నూల్ క్రైం: తమ్ముడిని అన్న హత్య చేసిన ఘటనలో ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. తిమ్మాజిపేట మండలం పుల్లగిరికి చెందిన సుంకరి సత్తయ్య, సుంకరి ఆంజనేయులు అన్నదమ్ములు. ఇరువురికి ఈనెల 25న రాత్రి సమయంలో పాత మంచం విషయంలో గొడవ అయ్యింది. మద్యం సేవించిన సుంకరి ఆంజనేయులు అన్నను దుర్భాషలాడాడు. ఈ క్రమంలో సుంకరి ఆంజనేయులును ఇంట్లో నుంచి బయటకు లాక్కొచ్చి అన్న సుంకరి సత్తయ్య ఐరన్ రాడ్డుతో, భార్య గౌరమ్మ, అతని కొడుకు మహేష్ గొడ్డలితో విచక్షణారహితంగా దాడి చేయడంతో అయన అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. హత్యకు పాల్పడిన ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐ కనకయ్య, ఎస్ఐ భాస్కర్‌రెడ్డి ఉన్నారు.



మట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాస్

క్షుద్రపూజలు చేసిన ఇద్దరి అరెస్ట్

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలో క్షుద్రపూజలు నిర్వహించిన ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. సోమవారం జిల్లా కేంద్రంలో రాత్రి 11గంటల సమయంలో లింగాలకు చెందిన ఇనాయత్, జిల్లా కేంద్రానికి చెందిన మోయిన్ బస్టాండ్ వద్ద ఉన్న పూలదుకాణం, ఓ ఫర్నిచర్ దుకాణం వద్ద క్షుద్రపూజలు నిర్వహించిన పూజా సామగ్రిని వదిలివెళ్లారు. పూల దుకాణా యజమాని సీసీ పుటేజీలో పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. లింగాలకు చెందిన ఇనాయత్, జిల్లాకేంద్రానికి చెందిన మోయిన్‌లు క్షుద్రపూజలకు పాల్పడ్డారని గుర్తించి వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్ ఖాజాఖాన్ సూచనలతో క్షుద్రపూజలకు పాల్పడ్డామని అంగీకరించనట్లు తెలిపారు. ఇనాయత్, మోయిన్‌లను రిమాండ్‌కు తరలించామని, కౌన్సిలర్ ఖాజాఖాన్ పరారీలో ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు.

క్లుప్తంగా...



సీఎం జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ సీనియర్ నేత సూర్యారావు

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ సీనియర్ నేత గొల్లపల్లి

సాక్షి, అమరావతి/విజయవాడ స్పోర్ట్స్: టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, పి.గన్నవరం టీడీపీ నేత నేలపూడి స్టాలిన్ బాబు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారు బుధవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వారికి సీఎం వైఎస్ జగన్ పార్టీ కండువాలు కప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ పి.వి.మిథున్‌రెడ్డి, ఎంపీ కేశినేని నాని పాల్గొన్నారు. అనంతరం సీఎం క్యాంపు కార్యాలయం వద్ద గొల్లపల్లి సూర్యారావు మాట్లాడుతూ చంద్రబాబు, లోకేశ్‌లనుద్దేశించి సంచలన వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు నాయకత్వంలో టీడీపీ పెత్తందార్లకు అనుకూలంగా, దళిత వర్గాలకు, సామాజిక న్యాయానికి వ్యతిరేకంగా ఉందని చెప్పారు. చంద్రబాబు, లోకేశ్ టీడీపీ నేతలు, కార్యకర్తల పట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని అన్నారు.

ఒంగోలు లోక్‌సభ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా చెవిరెడ్డి

- మరో ఐదుగురు పార్టీ సమన్వయకర్తల నియామకం
- గుంటూరు లోక్‌సభకు కిలారి రోశయ్య



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మరో రెండు పార్లమెంటు స్థానాలకు, మూడు శాసన సభ స్థానాలకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలను నియమిస్తూ పార్టీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. పార్టీ సమన్వయకర్తల ఎనిమిదో జాబితాలో ఒంగోలు లోక్‌సభ నియోజకవర్గానికి చెవిరెడ్డి భాస్కరరెడ్డిని, గుంటూరు లోక్‌సభ నియోజకవర్గానికి కిలారి రోశయ్యను నియమించారు. పొన్నూరు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా అంబటి మురళి, కందుకూరుకు బుర్రా మధుసూదన్ యాదవ్, గంగాధర నెల్లూరు (జీడీ నెల్లూరు)కు కల్లత్తూర్ కృపాలక్ష్మిని నియమించారు. ఈమేరకు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది.

మాటకు మించి సాయం

ప్రతి అడుగులో అన్నదాతకు తోడుగా నిలబడ్డాం: సీఎం జగన్

- రూ.50 వేలే ఇస్తామని చెప్పినా ప్రతి ఒక్కరికీ రూ.67,500 ఇచ్చాం
- అన్నదాతలకు ఈ ఐదేళ్లలో రూ.1.85 లక్షల కోట్ల మేర ప్రయోజనం చేకూర్చాం
- వైఎస్సార్ రైతు భరోసా మూడో విడతగా 53.58 లక్షల కుటుంబాలకు రూ.1,078.36 కోట్లు
- సున్నా వడ్డీ రాయితీ కింద 10.79 లక్షల మందికి మరో రూ.215.98 కోట్లు
- క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి జమ చేసిన సీఎం జగన్



వైఎస్సార్ రైతు భరోసా చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: అన్నదాతల కష్టం తెలిసిన ప్రభుత్వంగా ఈ ఐదేళ్లలో ప్రతి అడుగూ రైతులు, రైతు కూలీలు బాగుండాలని మనసా వాచా కర్మణా వేస్తూ వచ్చామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని ప్రగాఢంగా విశ్వసిస్తూ విత్తనం నుంచి పంట విక్రయం వరకూ అన్ని విధాలుగా చేయి పట్టుకుని నడిపించామన్నారు. ప్రతీ పథకాన్ని పేద రైతు కుటుంబాలకు అందుబాటులోకి తెచ్చి సంక్షేమ ఫలాలన్నీ అందించామని, రాష్ట్రంలో ఐదేళ్లుగా మాత్రమే ఇలా జరుగుతోందని గుర్తు చేశారు. ఎన్ని కష్టాలు ఎదురైనా చెప్పిన సమయానికి చెప్పినట్లుగా రైతన్నలకు భరోసా కల్పిస్తూ వ్యవసాయాన్ని పండగ చేసిన ప్రభుత్వం ఇదేనని, భవిష్యత్‌లోనూ ఇదే రీతిలో అండగా నిలిచి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. వైఎస్సార్ రైతు భరోసా ద్వారా వరుసగా ఐదో ఏడాది మూడో విడత కింద ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున 53.58 లక్షల మందికి రూ.1,078.36 కోట్ల పెట్టుబడి సాయంతో పాటు 10.79 లక్షల మందికి వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద రూ.215.98 కోట్లు కలిపి మొత్తం 64.37 లక్షల మంది ఖాతాలకు రూ.1,294.34 కోట్లను బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సీఎం జగన్ బటన్ నొక్కి నేరుగా జమ చేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఏమన్నారంటే..

హామీ కంటే మిన్నగా..

వైఎస్సార్ రైతు భరోసా ద్వారా ఏటా రూ.12,500 చొప్పున నాలుగేళ్లలో ప్రతి రైతు కుటుంబానికి రూ.50 వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామని మేనిఫెస్టోలో హామీ ఇచ్చాం. ఇచ్చిన హామీ కంటే మిన్నగా రూ.12,500 బదులు ఏటా రూ.13,500 చొప్పున అందచేశాం. రూ.50 వేలకు బదులు ఐదేళ్లలో ప్రతి రైతు కుటుంబానికి రూ.67,500 చొప్పున లబ్ధి చేకూర్చాం. ఇవాళ జమ చేస్తున్న పెట్టుబడి సాయంతో కలిపి ఐదేళ్లలో 53.58 లక్షల రైతు కుటుంబాలకు మొత్తం రూ.34,288 కోట్లు పంటలు వేసే సమయంలో పెట్టుబడి సాయంగా అందించాం. ప్రతి రైతన్నకు పెట్టుబడి సాయంగా డబ్బులు ఇవ్వడమే కాకుండా సున్నా వడ్డీని కూడా వర్తింపజేస్తూ రూ.లక్ష వరకు పంట రుణాలను అందిస్తున్న కార్యక్రమం కూడా మన ప్రభుత్వ హయాంలోనే జరుగుతోంది. గత ప్రభుత్వం 39.07 లక్షల మంది రైతులకు ఎగ్గొట్టిన బకాయిలతో కలిపి 84.67 లక్షల మంది అన్నదాతలకు సున్నా వడ్డీ రాయితీ కింద దాదాపు రూ.2,051 కోట్లు అందించాం.

మాఫీ పేరుతో బాబు మోసాలు..

2014 ఎన్నికల సమయంలో రూ.87,612 కోట్ల రైతుల రుణాలన్నీ బేషరతుగా మాఫీ చేస్తానన్న చంద్రబాబు తీరా గద్దెనెక్కిన తర్వాత ఎంత దారుణంగా మోసగించారో ఒక్కసారి గుర్తు తెచ్చుకోవాలని కోరుతున్నా. బ్యాంకుల్లో తాకట్టు పెట్టిన బంగారం ఇంటికి రావాలంటే బాబు సీఎం కావాలని పబ్లిసిటీ చేసి ఆ తరువాత వంచనకు పాల్పడ్డారు. చివరికి ఆ రూ.87,612 కోట్లపై సున్నావడ్డీని కూడా ఎగ్గొట్టాడు. ఐదేళ్లలో దాదాపు రూ.30 వేల కోట్లు ఆ వడ్డీలకే అవుతుంది. ఆయన ఎగ్గొట్టిన సున్నా వడ్డీ బకాయిలను కూడా మనమే ఇచ్చాం. ఐదేళ్లలో ఒక్క వైఎస్సార్ రైతు భరోసా పీఎం కిసాన్ పథకం ద్వారానే రైతుల చేతుల్లో రూ.34,288 వేల కోట్లు పెట్టాం. ధాన్యం కొనుగోలు కోసం మరో రూ.65 కోట్లు వెచ్చించాం. ఇలా వివిధ పథకాల ద్వారా అన్నదాతల సంక్షేమాన్ని కాంక్షిస్తూ వ్యవసాయ రంగం కోసం ఐదేళ్లలో రూ.1.85 లక్షల కోట్లు ఖర్చు చేసిన పరిస్థితి కళ్లెదుటే కనిపిస్తోంది.

బాబు గ్రాఫిక్స్ పెట్టుబడులు.. జగన్ రియల్ పెట్టుబడులు

కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ గణాంకాల్లో బట్టబయలైన బాబు గ్రాఫిక్స్ మాటల బురిడీ

బాబు హయాంలోకంటే సీఎం జగన్ హయాంలో రాష్ట్రంలో 3 రెట్లు పెరిగిన పెట్టుబడులు



సాక్షి, అమరావతి: చంద్రబాబు పాలన : ఓ కంప్యూటర్.. అందులో పెద్ద పెద్ద కంపెనీల పేర్లు, లోగోలు.. వాటి గ్రాఫిక్స్.. ఓ వంద అంకెలు, నలభై గీతలు.. వంద అబద్ధాలు. అన్నీ భూతద్దంలో చూపిస్తారు. వినడానికి, గ్రాఫిక్స్ చూడటానికి అబ్బో అనిపిస్తాయి. వాస్తవంగా వచ్చే పెట్టుబడులు సున్నా. పెట్టుబడులన్నీ కాగితాలకు, కంప్యూటర్లకే పరిమితం. సీఎం వైఎస్ జగన్ పాలన : చంద్రబాబు గ్రాఫిక్స్ లాంటి టక్కుటమారాలేమీ ఉండవు. అంతా వాస్తవికత. వచ్చే పెట్టుబడులే కాగితాల్లో కనిపిస్తాయి. అవే ప్రజలకు చేరతాయి. వాస్తవంగా నూరు శాతం పెట్టుబడులతో రాష్ట్రంలో పరిశ్రమలు వస్తాయి. కాగితాల్లో ఉన్న పెట్టుబడులే పరిశ్రమలుగా రూపుదిద్దుకొని ప్రజల ముందు నిలుస్తాయి. .. అందుకే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో రికార్డు స్థాయిలో పెట్టుబడులు వాస్తవ రూపంలోకి వస్తున్నాయి. గత చంద్రబాబు ప్రభుత్వంతో పోలిస్తే గడిచిన నాలుగున్నర ఏళ్లలో పెట్టుబడులు మూడు రెట్లు పెరిగాయి. ఈ విషయం వెల్లడించింది స్వయానా కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ. ఆ శాఖకు చెందిన డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఫర్ ఇండ్రస్టీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ) వెల్లడించిన వివరాల ప్రకారం.. 2014–18 సంవత్సరాల మధ్య కాలంలో (చంద్రబాబు పాలన) రాష్ట్రంలోకి వాస్తవంగా వచ్చిన పెట్టుబడులతో పోలిస్తే 2019 నుంచి 2023 జూన్ వరకు (వైఎస్ జగన్ పాలన) వచ్చిన పెట్టుబడులు 226.9 శాతం అధికంగా వచ్చాయి. 2014–18 క్యాలండర్ ఇయర్ ప్రకారం తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో వాస్తవ రూపంలోకి వచ్చి ఉత్పత్తిని ప్రారంభించిన పరిశ్రమల పెట్టుబడులు కేవలం రూ.32,803 కోట్లు మాత్రమే. ప్రస్తుత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో రూ.1,00,103 కోట్ల పెట్టుబడులు వాస్తవరూపం దాల్చాయి. చంద్రబాబు నాయుడు పెట్టుబడుల సదస్సు పేరుతో ప్రతి ఏటా హడావుడి చేసి లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చేశాయని చెప్పిన వార్తల్లో వాస్తవం ఏమాత్రం లేదని ఈ గణాంకాలే స్పష్టం చేస్తున్నాయి. చంద్రబాబు హయాంలో వివిధ పెట్టుబడుల సదస్సుల ద్వారా రూ.18.87 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చినట్లు ఉత్తుత్తి ఒప్పందాలు కుదుర్చుకున్నారన్న విషయం సుస్పష్టమైంది.

తరలి వస్తున్న దిగ్గజ సంస్థలు

చంద్రబాబుకు భిన్నంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎటువంటి ప్రచార ఆర్భాటాలు చేయకుండా పరిశ్రమలకు అన్ని విధాలా చేయూతనిస్తున్నారు. సీఎం జగన్ సహకారం అందించడంతో రిలయన్స్, అదానీ, టాటా, బిర్లా, హెచ్‌యూఎల్, బ్లూస్టార్, డైకిన్, ఇన్ఫోసిస్ వంటి అనేక దిగ్గజ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్నాయి. సాధారణంగా దేశంలో పెట్టుబడుల సదస్సులోజరిగే ఒప్పందాల్లో 16 నుంచి 17 శాతం మాత్రమే వాస్తవ రూపంలోకి వస్తాయి. కానీ విశాఖ పెట్టుబడుల సదస్సు జరిగి ఏడాది కాకుండానే 19 శాతం పెట్టుబడులు వాస్తవ రూపంలోకి వచ్చేశాయి. జీఐఎస్‌లో మొత్తం రూ.13.11 లక్షల కోట్ల విలువైన 386 ఒప్పందాలు జరగ్గా రూ.2.46 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులకు సంబంధించిన పరిశ్రమల పనులు వేర్వేరు దశల్లో ఉన్నాయి.

టీ–జే ఫ్లాప్ షో!

- తుస్సుమన్న టీడీపీ–జనసేన (టీజే) తొలి బహిరంగ సభ
- 6 లక్షల మంది వస్తారని ఊదరగొట్టిన నేతలు
- కిందా మీదా పడి 40–50 వేల మందికే పరిమితం
- పొత్తుకు తమ మద్దతు లేదని స్పష్టం చేసిన ఇరు పార్టీల కేడర్

సాక్షి ప్రతినిధి, ఏలూరు/ సాక్షి, భీమవరం: జనాదరణ లేక టీడీపీ–జనసేన (టీజే) తొలి బహిరంగ సభ తుస్సుమంది. అంతా.. ఇంతా.. నభూతో.. అన్నట్లు నాలుగైదు రోజులుగా ఊదరగొట్టిన ఎల్లో మీడియా ఇప్పుడు ఈ సభకు వచ్చిన జనం మాటెత్తడం లేదు. టీడీపీ–జనసేన పొత్తుకు జనం మద్దతును ఈ సభతో చాటిచెబుతామంటూ ఇరు పార్టీల అధినేతలు హడావుడి చేశారు. కేడర్ నిరసనల్ని, మనోభావాల్ని లెక్కచేయకుండా చంద్రబాబు, పవన్‌ల వ్యక్తిగత అ'జెండా'తో నిర్వహించిన సభకు రాష్ట్రం నలుమూలల నుంచి ఆరు లక్షల మంది తరలివస్తారంటూ ఎల్లో మీడియాలో మోత మోగించారు. తాడేపల్లిగూడెం సమీపంలో 22 ఎకరాల ప్రాంగణంలో అన్ని ఏర్పాట్లు చేసుకుంటే.. తీరా టీడీపీ–జనసేన పార్టీల కేడర్ నిరాదరణతో కాస్తా ఫ్లాప్ షోగా మిగిలింది. ఈ పొత్తు తమకు అంగీకారం కాదని స్పష్టం చేస్తూ నాయకులు, కింది స్థాయి కేడర్ సభను తుస్సుమనిపించారు. ప్రజలు పొత్తుకు బ్రహ్మరథం పడతారని చంద్రబాబు, పవన్‌లు ఎన్నో ఆశలు పెట్టుకుంటే.. టీడీపీ–జనసేన సంయుక్తంగా నిర్వహించిన తొలి బహిరంగ జెండా సభకు వారి లక్ష్యంలో పది శాతం మంది కూడా రాకపోవడం ఆ పార్టీల భవితవ్యాన్ని ప్రశ్నార్థకంగా మార్చింది. సభకు హాజరైన వారి సంఖ్య చూసి ఆ పార్టీల అగ్ర నేతలు విస్తుపోయారు. గ్యాలరీల్లో సగం పైగా కుర్చీలు ఖాళీగా కనిపించడంతో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు కంగుతిన్నారు.



సభకు అరకొరగా హాజరైన టీడీపీ–జనసేన కార్యకర్తలు, నాయకులు

టీ–జే పార్టీ నేతల్లో నైరాశ్యం

టీడీపీ–జనసేన నిర్వహిస్తున్న తొలి ఉమ్మడి సభకు తాడేపల్లిగూడెం సమీపంలోని ప్రత్తిపాడు వద్ద జాతీయ రహదారి బైపాస్ పక్కనే ఉన్న 22 ఎకరాల మైదానాన్ని ఎంచుకున్నారు. 500 మంది కూర్చోవడానికి వీలుగా వేదికతోపాటు చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు వేర్వేరుగా హెలికాప్టర్‌లలో రానుండటంతో అక్కడకు సమీపంలో రెండు హెలీప్యాడ్‌లు ఏర్పాటు చేశారు. వేదిక, హెలి ప్యాడ్‌లు, వీవీఐపీల రెస్ట్ రూమ్‌లు, పార్కింగ్‌కు ఏడు ఎకరాలు పోగా మిగిలిన 15 ఎకరాల్లో కార్యకర్తల కోసం 22 గ్యాలరీలు సిద్ధం చేశారు. ఒక్కో గ్యాలరీలో 1,500 కుర్చీల చొప్పున 22 గ్యాలరీల్లో 33 వేల కుర్చీలు వేశారు. మొత్తం కుర్చీలన్నీ నిండిపోయి 15 ఎకరాల ప్రాంగణం కిక్కిరిసిపోతే దాదాపు 60 వేల మంది హాజరైనట్లు లెక్క. అయితే సభ ప్రారంభం నుంచి చివరిదాకా సగం గ్యాలరీలు ఖాళీగానే ఉన్నాయి. వాస్తవానికి ఆరు లక్షల మంది జనం వస్తారని టీడీపీ–జనసేన నేతలు చెప్పారు. అయితే అది సాధ్యం కాదని వారికీ తెలుసు. అందుకే తక్కువ స్థలం ఉన్న చోట సభ నిర్వహించి, జనం కిక్కిరిసిపోతే.. దానినే కొండంతలు చేసి చూపాలన్న టీడీపీ, జనసేన అగ్రనేతల పన్నాగం బెడిసికొట్టింది. మొత్తంగా 40–50 వేల మంది కూడా హాజరు కాకపోవడం ఆ పార్టీ శ్రేణుల్లో నైరాశ్యం నెలకొంది.

కోడేరు వాసికి బంగారు పతకం



గవర్నర్ చేతుల మీదగా బంగారు పతకం అందుకుంటున్న రహీం ఖాద్రీ

కోడేరు: మండల కేంద్రానికి చెందిన ఎండీ రహీం ఖాద్రీ ఎంఫిల్ పూర్తి చేయడంతో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చేతుల మీదగా బంగారు పతకం, ప్రశంసాపత్రం అందుకున్నారు. జీఎస్ గబ్రియల్ పర్యవేక్షణలో 'అదురే ముస్లి కథలు.. భాషాశైలి విశ్లేషణ' అనే అంశంపై రహీం ఖాద్రీ పరిశోధన చేశారు. బుధవారం పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో నిర్వహించిన 16వ స్నాతకోత్సవంలో గవర్నర్ బంగారు పతకం అందజేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్లు, పరిశోధక విద్యార్థులు, తల్లిదండ్రులు ఆయనను అభినందించారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠాపన

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం రవీంద్రనగర్‌లోగల పోచమ్మదేవి (శీతలాదేవి) ఆలయంలో శిఖర కలశ, నాగదేవత ప్రతిష్ఠాపన మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం వేదపారాయణం, జలాధివాస ఉత్థాపన, పోచమ్మదేవికి చండీహోమం, శిఖర కలశాలు, నాగుల ఊరేగింపు చేపట్టారు. గురువారం ఆవాహిత దేవతా హోమాలు, శక్తిపీఠం వ్యవస్థాపకుడు శాంతానంద పురోహిత్ చేతులమీదుగా శిఖర కలశస్థాపన, నాగదేవతా ప్రతిష్ఠా మహోత్సం ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి వెంట గణేష్, కౌన్సిలర్ వేదవ్రత్, శ్రీనివాస్ రెడ్డి, నవకాంత్, సతీష్, నరేందర్, చారి తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవాల్లో పూజలు చేస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

అహోబిల మఠానికి పట్టువస్త్రాల సమర్పణ

- జోగుళాంబ ఆలయం నుంచి తీసుకెళ్లిన అధికారులు
- ప్రభుత్వ ప్రతినిధిగా దేవదాయ శాఖ కమిషనర్



అహోబిల మఠంలో పట్టు వస్త్రాల సమర్పణకు బయల్దేరిన కమిషనర్ అనిల్‌కుమార్, ఈఓ, చైర్మన్

అలంపూర్: జోగుళాంబ అమ్మవారి ఆలయానికి మరో అరుదైన ఖ్యాతి లభించింది. ఆంధ్రప్రదేశ్‌లోని అహోబిల మఠంకు చెందిన రుద్రవరం ఆలయానికి అలంపూర్ ఆలయాల నుంచి పట్టు వస్త్రాలు సమర్పించే అవకాశం దక్కింది. రుద్రవరం నర్సింహస్వామి ఆలయానికి తెలంగాణ దేవదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్, జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి క్షేత్ర ఆలయ ఈఓ పురేందర్ కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ చిన్న కృష్ణయ్య నాయుడు, ఆలయ ప్రధాన అర్చకుడు ఆనంద్ శర్మ బుధవారం పట్టువస్త్రాలను అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో పట్టువస్త్రాలను అందజేసినట్లు ఈఓ తెలిపారు. పూర్వం కాకతీయ వంశంలోని ప్రతాపరుద్రవర్మ అహోబిలం వద్ద రుద్రవరం అనే గ్రామంలో ఆలయం నిర్మాణం చేసినట్లు తెలిపారు. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ.. అహోబిల మఠం వారు తెలంగాణ ప్రభుత్వానికి ఓ లేఖ రాసినట్లు చెప్పారు. ప్రతాపరుద్రవర్మ నిర్మించిన ఆలయంలో ఏటా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. గత సాంప్రదాయానికి వన్నె తెచ్చేలా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పట్టు వస్త్రాలు అందజేయాలని లేఖలో కోరినట్లు తెలిపారు. ఈ లేఖకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందిస్తూ ఈ బాధ్యతలను రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖకు అప్పగించినట్లు తెలిపారు. రాష్ట్రంలో కాకతీయులు నిర్మించిన ఆలయాల్లో అలంపూర్ ఒకటిగా ఉంది. పట్టువస్త్రాలను సమర్పించే బాధ్యత జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలనికి అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఉత్తర్వుల మేరకు దేవాదాయ శాఖ ద్వారా పట్టువస్త్రాలు, ఇతర పూజాద్రవ్యాలు, మంగళద్రవ్యాలతో కలిపి అందజేసినట్లు పేర్కొన్నారు.

ప్రసాద్ స్కీం భవనం పరిశీలన

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ పట్టణంలో నిర్మిస్తున్న ప్రసాద్ స్కీం భవనాన్ని బుధవారం రాత్రి దేవాదాయశాఖ కమిషనర్ అనిల్ కుమార్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన భవన నిర్మాణ శైలిని, నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు ఎంత మంది యాత్రికులు వస్తారు. వారికి ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారని ఆరా తీశారు. అనంతరం జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర ఆలయాలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ పురేందర్ కుమార్, చైర్మన్ చిన్న కృష్ణయ్య మాట్లాడుతూ.. మహాశివ రాత్రి రోజు, అత్యంత అరుదుగా జరిగే మహా కుంబాభిషేకం కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. ఆలయంలో నిరుపయోగంగా ఉన్నా మిశ్రమ, బంగారు, వెండిని కరిగించి ఆలయానికి అవసరమయ్యే వస్తువుల తయారీకి అనుమతులు కోరారు.

శ్రీశైలం తరలిన అమరచింత పద్మశాలీలు

అమరచింత: శ్రీశైల మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా భ్రమరాంబిక మల్లికార్జున స్వామివార్లకు పట్టువస్త్రాలను సమర్పించేందుకు స్థానిక పద్మశాలి కులస్తులు బుధవారం శ్రీశైలం తరలివెళ్లారు. పట్టు వస్త్రాల తయారీకి వినియోగించే మగ్గంతో పాటు ముడిసరుకులను వాహనంలో తీసుకెళ్లారు. పట్టణంలోని శివ చౌడేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టణ పురవీధుల గుండా ఉరేగింపుగా శ్రీశైలంకు బయలు దేరారు. ఈ మేరకు మహంకాళి సత్యం మాట్లాడుతూ ప్రతి సంవత్సరం శ్రీశైల క్షేత్రంలోని పద్మశాలి భవన్‌లో మగ్గం ఏర్పాటు చేసుకుని అక్కడే పట్టువస్త్రాలను తయారు చేసి అందిస్తామన్నారు.



అమరచింత నుంచి శ్రీశైలంకు వెళ్తున్న పద్మశాలి నేతన్నలు

సిలిండర్ సబ్సిడీని వెంటనే ఇవ్వాలి

- సిర్పూర్ కాగజ్‌నగర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు

అచ్చంపేట రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న రూ.500 సిలిండర్ల సబ్సిడీని వినియోగదారులకు వెంటనే ఇవ్వాలని, లేదంటే గ్యాస్ కంపెనీలకు ముందస్తుగానే ప్రభుత్వం చెల్లించాలని సిర్పూర్ కాగజ్‌నగర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు డిమాండ్ చేశారు. బుధవారం అచ్చంపేటలోని బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బీజేపీని బలహీన పర్చడానికి కాంగ్రెస్, బీఆర్ఎస్ కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. అన్ని సర్వేలు దేశంలో బీజేపీ మూడోసారి ముచ్చటగా అధికారంలోకి రానున్నాయని చెబుతున్నాయని, ఆ దిశగా దేశ ప్రజలందరూ బీజేపీ వైపే ఉన్నారన్నారు. రాష్ట్రంలో 8 నుంచి 12 ఎంపీ సీట్లు రానున్నాయని, దేశంలో 370కి పైచిలుకు సీట్లు రానున్నాయని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ ఎనిమిదో నిజాం ప్రభు కాగా.. సీఎం రేవంత్‌రెడ్డి 9వ నిజాం ప్రభు అని ఆరోపించారు. కేసీఆర్ స్టైల్‌లోనే రేవంత్‌రెడ్డి నడుస్తున్నాడని ఆరోపించారు. రాష్ట్ర, దేశ ప్రజలు క్లారిటీగా ఉన్నారని, ప్రలోభాలకు ఎవరూ తలొగ్గరన్నారు. విజయసంకల్ప యాత్ర సక్సెస్ అయ్యిందన్నారు. రాష్ట్రంలో బీజేపీకి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రజల మనసుల్లో విషబీజాలు నాటుతున్నారని ఆరోపించారు. మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ సొంత జిల్లాలోని మెదక్ పార్లమెంట్ స్థానానికి పోటీ చేసేందుకు బీఆర్ఎస్‌కి అభ్యర్థులు దొరకడం లేదన్నారు. దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ తుడిచి పెట్టుకుపోయిందని, కేవలం తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో మాత్రమే అధికారంలో ఉందన్నారు. శ్రీవర్ధన్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, సోలంకి శ్రీనివాస్, మంగ్యానాయక్, మండికారి బాలాజీ, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ ఎమ్మెల్యే హరీష్‌బాబు

లాభాల్లో సమాజసేవకు వినియోగం

- కేబీఎస్ బ్యాంక్ ఎండీ దుర్గాప్రసాద్

స్టేషన్ మహబూబ్‌నగర్: సామాజిక దృక్పథంతో కార్పొరేట్ సీఎస్ఆర్ కింద కృష్ణ భీమా సమృద్ధి లోకల్ ఏరియా బ్యాంకు (కేబీఎస్) తమవంతు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు మేనేజింగ్ డైరెక్టర్ దుర్గాప్రసాద్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని కేబీఎస్ బ్యాంక్ శాఖ కార్యాలయ ఆవరణలో 24వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 75మందికిపైగా దివ్యాంగులకు వీల్‌చైర్, ట్రై సైకిళ్లు, వినికిడి పరికరాలు తదితరవి అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎండీ మాట్లాడుతూ.. 2001లో స్థాపించిన బ్యాంక్ 23 ఏళ్ల నుంచి ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆర్‌బీఐ నియమ, నిబంధనల ప్రకారం ఈ బ్యాంక్ పనిచేస్తుందన్నారు. 29 శాఖలు, 39 ఏటీఎంలు, 3.77లక్షల ఖాతాదారులు, 3.10లక్షల డిపాజిట్లు, రూ.900 కోట్ల వ్యాపారంతో తమ బ్యాంక్ ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. 2024 మార్చి నాటికి రూ.వెయ్యి కోట్ల వ్యాపారం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. తెలంగాణ, కర్ణాటక, ఏపీలోని 1,700 గ్రామాల్లో చేతివృత్తిదారులు, పేద, చిన్న సన్నకారు రైతులు, చిరు వ్యాపారుల ఇంటింటికీ బ్యాంకింగ్ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. బ్యాంకు వచ్చిన లాభాల్లో కొంతమేర సమాజ సేవకు వినియోగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జీఎం సీఎఫ్ఓ ఎంజే.మురళీకృష్ణ, జీఎం సుధాకర్, జీం, సీఓఓ నరేంద్రకుమార్, పరమేశ్వరరావు, బ్రాంచ్ మేనేజర్ ఆనంద్‌కుమార్, ఎల్‌డీఎం భాస్కర్, ఉద్యోగులు పాల్గొన్నారు.



దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందజేస్తున్న ఎండీ దుర్గాప్రసాద్ తదితరులు

సెమీస్‌లో ఖమ్మంతో తలపడనున్న పాలమూరు

- హైదరాబాద్‌తో రంగారెడ్డి ఢీ

జడ్చర్ల టౌన్: పట్టణంలోని మినీస్టేడియం, ఎంఎస్ మైదానాల్లో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అండర్–14 బాలుర ఎస్‌జీఎఫ్ క్రికెట్ టోర్నీ చివరిదశకు చేరుకుంది. గురువారం నిర్వహించే సెమిఫైనల్‌లో ఆతిథ్య జట్టు మహబూబ్‌నగర్‌తో ఖమ్మం తలపడనుండగా, హైదరాబాద్‌తో రంగారెడ్డి జట్టు పోటీ పడనుంది. మూడు రోజులుగా సాగుతున్న టోర్నీలో హైదరాబాద్ జట్టు ఆడిన నాలుగు మ్యాచ్‌లోనూ వరస విజయాలు సాధించగా, మహబూబ్‌నగర్ జట్టు మూడింట గెలిచింది. బుధవారం హైదరాబాద్ మ్యాచ్‌లో 38 పరుగుల తేడాతో ఓటమి పాలయ్యింది. అయినప్పటికీ మూడు మ్యాచ్‌లు విజయం సాధించటంతో సెమీస్‌కు చేరుకుంది. గురువారం టోర్నీ చివరిరోజు.



క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

గౌడకులస్తులకు ప్రభుత్వం సానుకూలం

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థికి మద్దతుగా 3న గౌడ ఆత్మీయ సమ్మేళనం
- రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షుడు కేశం నాగరాజుగౌడ్

స్టేషన్ మహబూబ్‌నగర్: గౌడకులస్తుల సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం సానుకూలంగా ఉందని గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, టీపీసీసీ గీతకార్మిక విభాగం చైర్మన్ కేశం నాగరాజుగౌడ్ వెల్లడించారు. జిల్లా కేంద్రంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ నివాసంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ విజయంలో గౌడ సామాజికవర్గం తమ వంతు భాగస్వామైనట్లు తెలిపారు. పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు గౌడ్‌లు మద్దతుగా నిలిచినట్లు చెప్పారు. ఇటీవలే కోస్గి సభలో సీఎం రేవంత్‌రెడ్డి మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థిగా చల్లా వంశీచంద్‌రెడ్డిని ప్రకటించారని, ఈ మేరకు ఆయనకు మద్దతుగా వచ్చేనెల 3వ తేదీన జిల్లా కేంద్రంలోని ఏఎస్ఎన్ గార్డెన్స్‌లో గౌడ ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ తదితరులు హాజరవుతారని చెప్పారు. మున్సిపల్ చైర్మన్, జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ ఆత్మీయ సమ్మేళనంలో పార్లమెంట్ పరిధిలోని ఆరుగురు ఎమ్మెల్యేలు హాజరవుతారని, ఈ సమావేశంలో గౌడ కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఇటీవలే మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన ఆయనను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.



మాట్లాడుతున్న నాగరాజుగౌడ్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్